

# ముద్దుబంతి

"క్రికెట్ ఫేట్" ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గొప్ప వేలం వెర్రి ఆట (క్రేజీ గేమ్) గుండియా, గోకిస్థాన్ దేశాలు, ఆ ఆటలో విపరీతమైన నైపుణ్యం సంపాదించాయి.

కాని "కాస్ట్ రిలై కప్" అష్టదేశ కూటమిలో ఫైనల్స్‌కి వస్తాయనుకున్న ఈ రెండు దేశాలు పరమ నిర్లక్ష్యంగా ఆడి, సెమీ ఫైనల్స్‌లోనే ఘోర పరాజయం చవిచూపించి, క్రికెట్‌ఫేట్ ఆత్మ గౌరవాన్ని నేలనేసి, కాలరాచేశాయి.

చిత్తుగా ఓడిపోతాయనుకున్న "యాష్ట్రేదియా" "లాండింగ్" దేశాలు చిత్రంగా గుండియా, గోకిస్థాన్ దేశాలకి నున్నగా గుండుగోకేసి, నిండా ముసుక్కప్పేసి, చెరో కప్పూచ్చుకెళ్ళిపోయారు. క్రికెట్ అభిమానులందరూ చెప్పూచ్చుకొక్కొట్టుకున్నారు. గుండియా వీరులు "కబుర్లదేవ్" చేతన్ చేన్ తోడన్ తోన్ శర్మ" "రద్దు" చిత్తుగా ఓడిపోయారు.

"అల్లావుద్దీన్" అద్భుతంగా రుద్దినా చివరికి అయిపూ అజా లేకుండా పోయాడు.

"గావాక్ష" ని గొప్ప ఆటగాడుగా గుర్తించారు కాని, ఆయనగారి ఆట గవాక్షం ఎక్కి దూకేసింది.

"రేచీకటి "రవికాంత్" కంటికి పెద్ద దెబ్బ తగిలించుకుని ఆట పాడు చేసేశాడు.

"చన్ద్రశాస్త్రి" మరీరి శాస్త్ర ప్రకారం ఆడాడు. ఆట దెబ్బతింది.

"మిస్టరుష్ణ" "వాంగోమోర్" "తెగవర్కర్" లకు ఉష్ణం ఎక్కువ వర్క్ చేసి, ఆట మంట కలిపేశారు.

"మహేంద్రమణి"కి చివరిలో ఛాన్సు వచ్చింది కాని గడ్డి మోపు లాటి గడ్డం చెడ్డ అడ్డం వచ్చేసింది.

ఈ మహావీరుల మీద లాండింగ్ దేశం "లాండ్" అయిపోయింది.

గోకిస్థాన్ వీరులు "మానూమాకురావ్" ఇద్దరు చెట్టు పెట్టి గుడ్డ పిండేశారు.

"మియ్యాకుయ్యో" కుండ బద్దలు కొట్టేశాడు.

"అక్రమ్‌వాసీ" తివాసీలా పడిపోయాడు.

"ముసల్నసర్" కాళ్ళు జాపేసాడు.

"రమ్ రాజా" దిమ్మెక్కువయి చేతులెత్తేశాడు.

"తోసెయ్యహం" కి అహం ఎక్కువై పోయింది.

"సలామ్ జాకాల్" సగామ్‌జిరాఫ్" సలాములు కొట్టేశారు.

"సలామ్ ఊసెయ్" కానీ మోసెయ్ లకు సరైన ఛాన్సులు రాలేదు.



"యాష్ ట్రేదియా" ఈ వీరుల్ని "యాష్ ట్రే" లోకి విసిరేసింది.

నిస్సారపడిపోయిన ప్రేక్షకుల ఉత్సాహోర్ధం మరింత ఆర్భాటంగా "డోన్ట్ రిలైసాసర్" పోటీ ఏర్పాటైంది. నిజానికి క్రిక్కిరిసిన ప్రేక్షకులతో స్టేడియం దద్దరిల్లిపోవాలి. కాని ఎడారిలో చిట్టీత పొదల్లా అక్కడక్కడ జనం ఉన్నారు. వాళ్ళలో బంధువర్గం, అనుచరవర్గమే వున్నారు.

పోటీ ప్రారంభం కావడానికి, ఇంకా కొద్ది నిమిషాలే సమయం ఉంది.

"కబుర్లదేవ్" మానూమాకురావ్ ఒక్కసారి స్టేడియం పరకాయించి చూద్దామని బయటకొచ్చారు.

స్తబ్ధుగా వున్న స్టేడియం చూసి "ఏమైనా సరే ఈసారి ఆట ఉత్తేజపూరితంగా ఆడి, జనాన్ని తిరిగి చైతన్యవంతుల్ని చెయ్యాలి" అనుకున్నారు.

ఇంతలో కొన్ని వందలమందిని బిలబిలగా తీసుకొచ్చి బలవంతంగా గ్యాలరీలో కూర్చోబెట్టసాగారు.

ఆశ్చర్యంగా చూడసాగారు కికెట్ వీరనాయకులు. కూర్చున్నవాళ్ళందరికి గళ్ళచొక్కాలు గళ్ళనిక్కర్లూ ఉన్నాయి.

వాళ్ళందరూ ఎవరని కామెంటేటర్‌ని అడిగారు.

"ఫ్రెండ్స్! వాళ్ళందరూ మన రెండు దేశాల్లోని సెంట్రల్ జైళ్ళలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నవాళ్ళు" చెప్పారు కామెంటేటర్ "మహాభ్యుదయ!"

"వాళ్ళనెందుకలా బలవంతంగా తీసుకొచ్చి కూర్చోబెడుతున్నారు?"

"అది కోర్టు ఆజ్ఞ"

"ఐసీ! వాళ్ళకి జీవితంలో కొత్త ఉత్సాహం చిగురింపచేయడానికి కాబోలు!" అన్నాడు కబుర్లదేవ్!"

"నో! నో!" చెప్పాడు కికెట్ మహాభ్యుదయ "అది వాళ్ళ శిక్షలో భాగం! దట్సాల్"

పదికిలోల ముద్దబంతి పూబంతి వందమైళ్ళ వేగంతో వచ్చి వీరుల ముఖానికి తగిలింది.